నిర్మించారు.. తరలించారు

- చొప్పదండిలో రూ.2.85 కోట్లతో డిగ్రీ కళాశాల అదనపు గదుల నిర్మాణం
- నిర్వహణ లేక గతంలో క్లాసుల నిలిపివేత, కళాశాల తరలింపు
- జూనియర్ కళాశాలలో ప్రారంభం, ముగింపు
- డిగ్రీ కళాశాల భవనంలోకి మారిన జూనియర్ కళాశాల



చొప్పదండి డిగ్రీ కళాశాల భవనం

చొప్పదండి: నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ విద్య ఆవశ్యకత గుర్తించి ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఉన్నత విద్యాశాఖ అధికారులు ముగింపు పలికారు. దశాబ్దాల పోరు అనంతరం చొప్పదండిలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. పుష్కర కాలం క్రితం చొప్పదండి బీసీ కాలనీ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల తరుగతులు ప్రారంభించారు. చొప్పదండి మండల ప్రజలతో పాటు, ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు, తదితర మండలాల్లోని గ్రామాల విద్యార్థులు డిగ్రీ కళాశాలను ఉపయోగించుకున్నారు. ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు కట్టే స్థోమత లేని పేద విద్యార్థులకు కళాశాల వరంగా ఉండేది.

నిర్వహణ లేక మూసివేత

డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్, ఎన్ఎస్ఎస్ యూనిట్‌తో సహా పలు కోర్సులను మంజూరు చేశారు. బీసీ కాలనీ సమీపంలో కళాశాల ఉండటంతో చొప్పదండిలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కళాశాలకు వెళ్లడానికి నడకదారి తప్ప వేరేదారి లేకుండా పోయింది. సుమారు కిలోమీటర్‌కు పైగా దూరం విద్యార్థినులు వెళ్లడానికి ఇబ్బందిగా ఉండేది. పైగా గ్రామాల్లో డిగ్రీ కళాశాలపై ప్రచారం లేకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక నిర్వహణ తగ్గిపోవడం, ప్రైవేటు కళాశాలలతో లాలూచీ పడటంతో విద్యార్థుల సంఖ్య తగ్గడం, ఫలితాలు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాల ప్రారంభమైన ఏడేళ్లకే క్లాసులను నిలిపివేశారు.

రూ. 2.5 కోట్లతో భవన నిర్మాణం

జూనియర్ కళాశాలలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కొనసాగించడంతో రెండు కళాశాలల విద్యార్థులకు ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 2016లో డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణాలకు ప్రస్తుత జూనియర్ కళాశాల ముందుగల మైదానంలో రూ. 2.55 కోట్లతో డిగ్రీ కళాశాల భవనాలను నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. భవనాలను పూర్తిచేసి ఆగస్ట్ 2018లో హడావిడిగా ప్రారంభం కూడా చేశారు.

అప్పటికే కథ ముగిసింది..

డిగ్రీ కళాశాల కోసం పక్కా భవనాలను నిర్మించినా విద్యార్థులకు ప్రయోజనం చేకూరలేదు. జూనియర్ కళాశాలలో కొనసాగించిన తరగతులకు విద్యార్థుల నుంచి స్పందన రాకపోవడంతోపాటు క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గడంతో 2018లోనే డిగ్రీ కళాశాల తరగతులు నిలిపివేశారు. కళాశాలలో ఉన్న విద్యార్థులను కరీంనగర్‌కు తరలించారు. డిగ్రీ కళాశాల తరగతుల ముగింపు జరిగిన నాలుగేళ్లకు డిగ్రీ కళాశాల అనుమతులను చొప్పదండి నుంచి రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేటకు తరలించారు. డిగ్రీ కళాశాలను తరలించిన విషయం కూడా ఏడాదికాలంగా బయటకు పొక్కలేదు.

ఉలుకు పలుకు లేదు..

ఎంతో కష్టపడి సాధించుకున్న డిగ్రీ కళాశాలలో సాంప్రదాయ కోర్సులతో పాటు, విభిన్న కోర్సులు ప్రారంభించి విద్యార్థులకు అనుకూలంగా తీర్చిదిద్దాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు కళాశాల తరలింపుపై ఉలుకు పలుకు లేకుండా ఉన్నారు. మున్సిపాలిటీగా మారిన చొప్పదండిలో రోజురోజుకూ జనాభా పెరుగుతుండటంతో ఉన్నత విద్యకు సంబంధించిన అంశాల్లో డిగ్రీ కళాశాల ఆవశ్యకత ఎంతో ఉంటుందని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కళాశాలను కొనసాగించాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.



తరలింపు తగదు

చొప్పదండితో పాటు, పరిసర గ్రామాల్లోని పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక, ప్రైవేటులో ఫీజులు కట్టలేక డిగ్రీ కళాశాలను ఉపయోగించుకునే వారు. కళాశాల నిర్వహణ లేకపోవడంతో విద్యార్థుల ఆదరణ తగ్గింది. మళ్లీ వృత్తి పరమైన కోర్సులు ప్రారంభించి విద్యార్థులకు ఉపయోగించాలి అంతేకానీ తరలించడం తగదు. – సింహాచలం ప్రభాకరాచార్యులు, అర్చకుడు, చొప్పదండి



డిగ్రీ కళాశాలను కొనసాగించాలి

భవనాలను నిర్మించకముందే డిగ్రీ కళాశాల తరగతులను నిలిపివేశారు. జూనియర్ కళాశాలలో ఇరుకుగా ఉన్న సమయంలోనే విద్యార్థుల నుంచి ఆదరణ వచ్చింది. సరైన నిర్వహణ ఉంటే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కళాశాలను ఇక్కడే కొనసాగించాలి. – గాజుల రాజ్‌కుమార్, పూర్వ విద్యార్థి, చొప్పదండి

క్లుప్తంగా

సన్మానం


సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ముదుగంటి సుధాకర్‌రెడ్డి శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం అందుకున్నారు. గోపాల్‌రావుపేట గ్రామంలో మంగళవారం వాయిస్ ఆఫ్ లవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ సత్యప్రసన్న, ఫౌండేషన్ చైర్మన్ రేఖ, మల్లేశం, కవిత, నాయకులు రాజిరెడ్డి, దామోదర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రమేష్, సాయిలు, అనంతరెడ్డి, కనకయ్య, శ్యాంరావు, రమణారెడ్డి పలువురు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు..


కమిషనర్‌ను సన్మానిస్తున్న గుర్రం నీరజ

చొప్పదండి: నిబద్ధతతో కూడిన సేవలను అందించిన అధికారులకే గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ విధుల్లో చేరి ఏడాది పూర్తయిన సందర్భంగా పాలకవర్గ సభ్యులు మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం, వైకుంఠధామాలు, జియో ట్యాగింగ్, భువన్ యాప్ ద్వారా పన్నుల పెంపు, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటు నిర్మాణం, తదితర అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యంపై అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రశాంత్‌కుమార్, కౌన్సిలర్లు శ్రీనివాస్, అశోక్, గంగరాజు, మహేశ్, నాయకులు గంగయ్య, మల్లేశం, నరేశ్, సత్యనారాయణ, రాజు, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, అంజయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ట్రాక్‌షీట్ అందజేత

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట ఐకేపీ కేంద్రంలో అవకతవకలు జరిగాయని గ్రామానికి చెందిన ఓ మహిళా రైతు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఐకేపీ అధికారులు గ్రామానికి వెళ్లి సర్పంచ్ మల్లీశ్వరి, వీవోఏ పద్మ సమక్షంలో విచారణ చేపట్టారు. 86 క్వింటాళ్ల 26 కిలోల తూకం రసీదును కేంద్ర నిర్వాహకులు అందజేశారని, 79 క్వింటాళ్ల 60 కిలోలకు మాత్రమే డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని రైతు వివరించగా కేంద్రం నిర్వాహకుల రసీదు, ఐకేపీ సీసీ ఇచ్చిన ట్రాక్‌షీట్‌లో ఎలాంటి వ్యత్యాసం లేదని గుర్తించి రైతుకు ట్రాక్‌షీట్ అందజేశారు. రైస్‌మిల్లుల్లో ధాన్యం కటింగ్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆగయ్య తండ్రి ఐలయ్య అనారోగ్యంతో మృతి చెందగా పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య నివాళి అర్పించారు. మంగళవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఐలయ్య కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. వెంట పార్టీ మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, గ్రామశాఖ అధ్యక్షుడు పిల్లి వేణు, బీఆర్ఎస్వీ మండలశాఖ అధ్యక్షుడు బోయిని మనోజ్‌కుమార్, నాయకులు రమేశ్, దామ సుఘు, సదానందం, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, మల్లేశం, రాజయ్య, కిష్టారెడ్డి పలువురు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


పరిచయం చేసుకుంటున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మహాలక్ష్మి ఐరన్ హార్డ్‌వేర్ రామడుగు రవీందర్‌రావు ఆధ్వర్యంలో జమ్మికుంట ప్రీమియర్ లీగ్ 1 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పట్టణం, మండల పరిధిలోని 24 క్రికెట్ టీంలు పాల్గొననున్నాయి. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు రాజు, విక్కి, విజయ్,శ్రీనివాస్‌లున్నారు.

భూమిపూజ

రామడుగు: మండల కేంద్రంలో రూ.6 లక్షలతో నిర్మించనున్న సులభ్ కాంప్లెక్స్ పనులకు మంగళవారం సర్పంచ్ పంజాల ప్రమీల భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్, ఉపసర్పంచ్ రాజేందర్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలుచేయాలని వినతి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంపీటీసీలు

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ గల్ఫ్ జేఏసీ జిల్లా కన్వీనర్ మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఏటా రూ. 500 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టాలని, గల్ఫ్ వెళ్లే కార్మికులకు వీసా చార్జీలు, రిక్రూట్‌మెంట్ ఫీజు, తదితర ఖర్చులకు ప్రభుత్వం పావలా వడ్డీకి రుణాలను అందించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఇంజపురి తిరుపతి, చిలుముల లక్ష్మణ్‌లతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీటీసీలు

రామడుగు మండల ఎంపీపీ కలిగేటి కవిత, ఎంపీటీసీలు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను గంగాధర మండలం బూరుగుపల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువా కప్పి సన్మానించారు. నాగుగేళ్ల పదవికాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేను కలిశారు. ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షులు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు వంచ మహేందర్‌రెడ్డి, మడ్డి శ్యాంసుందర్‌గౌడ్, నాయకులు పాపిరెడ్డి, రాజశేఖర్‌గౌడ్, కనకయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

గంగాధర: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బుగ్గోజి గణేశ్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.20,500 ఆర్థికసాయం అందించారు. బీసీబంధు, డబుల్‌బెడ్‌రూం ఇల్లు, రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరయ్యేలా చూస్తానన్నారు. కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం


జమ్మికుంట: పోటీలు నిర్వహిస్తున్న టీచర్లు


చొప్పదండి: పోటీల్లో విద్యార్థులు

చొప్పదండి: క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం మండల స్థాయి పోటీలను మంగళవారం చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కరుణ ప్రారంభించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలలకు ఎంపికయ్యే అవకాశాలను పెంచుకోవాలని కోరారు. షటిల్, రన్నింగ్, తదితర ఎనిమిది క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు క్రిష్ణ, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, సూర్యప్రకాశ్, సత్యానంద్, రజని, స్వప్న, సంతోశ్, శ్రీనివాస్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో మండల విద్యాధికారి విడుపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కన్వీనర్ రేణుక, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమలత, శేఖర్, సత్యనారాయణ, శ్రీను, సుమన్, ఉమా, తిరుమల, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళవారం పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు తాల్ల నరేశ్ ఆధ్వర్యంలో గడపగడపకూ పార్టీ విశిష్టతను వివరించారు. వెంట సురేశ్, నవీన్, హరీశ్, సతీశ్, భరత్, అభినయ్, గౌతమ్, అనిల్ సంపత్ ఉన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

మానకొండూర్: మండలంలోని అన్నారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ డీపీవో రవీందర్ మంగళవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులు, మౌలిక వసతులను పరిశీలించారు. వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కిషన్, ఉపసర్పంచ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో హైనా బీభత్సం

తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్‌లో హైనా బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి గ్రామంలో కుక్కలు భయంకరంగా మొరగడంతో బయటికి వచ్చిన గ్రామస్తులకు హైనా కంటపడింది. ఓ కుక్కను చంపుతుండగా గమనించిన గ్రామస్తులు కర్రలతో దాడికి యత్నించగా మల్లాపూర్ శివారులోని గుట్టల వైపు పారిపోయింది. గ్రామస్తులు వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఒక్కసారిగా హైనా కనిపించడంతో భయాందోళనకు గురయ్యామని గ్రామస్తులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మానకొండూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికి బీజేపీ పథకాలను వివరించారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పీఎం మోదీ తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమం ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక, రాంపూర్, బొత్తలపల్లి గ్రామాల్లో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి తమిళనాడు రాష్ట్ర బీజేపీ నాయకుడు శరవణ కుమార్ ఇంటింటి ప్రచారం చేశారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది, లక్ష్మీపూర్, రంగపేట, వేగురుపల్లి గ్రామాలలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, ప్రచారక్ వెంకటేశ్ పర్యటించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఇల్లందకుంట: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. సీతంపేటలో తొమ్మిదేళ్ల మోదీ పాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో బీజేపీ నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి ఎన్నికను హర్షిస్తూ స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

తహసీల్ ఎదుట రిటైర్డ్ పెన్షనర్ల నిరసన

హుజూరాబాద్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిటైర్డ్ పెన్షనర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ పీఆర్‌సీ సమయం ముగిసిందని, రెండో పీఆర్‌సీని నియమించాలని, ఐఆర్ చెల్లించలని, పెండింగ్ డీఏ, డీఆర్ వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఈహెచ్ ఎస్ కింద కార్పొరేట్ వైద్యం అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రసనలో హుజూరాబాద్ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరాత్రి ఈశ్వరయ్య, చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి, జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు బొంగొని వెంకటయ్య, నరేందర్, మునీరుద్దీన్, జి.రామకష్ణ, మండల బాధ్యులు జి.బుచ్చిరాజం, జి.గంగయ్య ఉన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన పోటీల్లో ఎం. ఆశ్రేయ, ఎం. మేరీ యాంజెల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం అంజయ్య మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూలో డీఈవో జనార్దన్‌రావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, ఆర్‌బీఐ ప్రతినిధి పాటిల్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారని వివరించారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలను ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు బుక్స్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజమౌళి, ఉపాధ్యాయులు జ్యోత్స్న, గోవర్దన్, శంకరమ్మ, శంకర్, ప్రతిమ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

హుజూరాబాద్/జమ్మికుంట/వీణవంక: వీణవంక మండలం మామిడాలపల్లిలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి యాదవ సంఘం, తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. హుజూరాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గీట్ల ముకుంద రెడ్డి అన్నారు. జమ్మికుంట పట్టణంలోని హెచ్‌పీ పెంట్రోల్ పంపు సమీపంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు.

విజ్ఞానయాత్రకు తరలి వెళ్లిన రైతులు



చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దాదాపు 50 మంది రైతులు మంగళవారం విజ్ఞానయాత్రకు తరలివెళ్లారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో ఆయిల్‌పామ్ సాగును సందర్శించారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఏరియా మేనేజర్ అప్పారావు సాగు వివరాలు వివరించారని రైతు వంతడ్పుల దిలీప్‌కుమార్ తెలిపారు. వెళ్లిన వారిలో లోహియా ఎడిబుల్ ఫీల్డ్ ఆఫీసర్ మ్యాద రవేణి ప్రవీణ్‌కుమార్, ఐకేపీ సీసీ గంప సంపత్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


అక్షితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి. శ్రావ్య, బి. మహేందర్, వి. రమ, కె. హారిక బాసర ట్రిపుల్ ఐటీలో 2022–23 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు సాధించారు. మంగళవారం విద్యార్థులను సర్పంచ్ అటికం శారద, ఎస్ఎంసీ చైర్మన్ ఆనవేని మల్లేశం, హెచ్ఎం సూర సుమలత అభినందించారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని అక్షిత పదో తరగతి ఫలితాల్లో మండలంలో టాపర్‌గా నిలిచింది. అనంతరం బాసర ఐఐటీలో సీటు సాధించింది. మంగళవారం టీచర్లు అక్షితను అభినందించి, శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమతీ రాణి, దామోదర్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, సుజాత, ఓదల్‌కుమార్, సరోజన, విజయకుమారి, అనిత, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హుజూరాబాద్ డిపోకు అవార్డులు


అవార్డులు అందుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులు

హుజూరాబాద్: హుజూరాబాద్ ఆర్టీసీ డిపోకు రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు వచ్చాయని డిపో మేనేజర్ పి. అర్పిత మంగళవారం తెలిపారు. దసరా, సంక్రాంతి చాలెంజ్‌లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్, కండెక్టర్లు హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అవార్డులు రావడంపట్ల కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత, ఎస్టీఐ కె. మురళిలు అభినందనలు తెలిపారు.

66వ రోజుకు మండల సాధన కమిటీ దీక్ష

గంగాధర: మండలంలోని గర్షకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష మంగళవారంతో 66వ రోజుకు చేరింది. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొంరయ్య వర్ధంతి సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దీక్షశిబిరం వద్ద వంటావార్పు నిర్వహించారు. జిల్లాలోనే అత్యధిక గ్రామ పంచాయతీలున్న గంగాధర మండలంలోని గర్షకుర్తి గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఏనాటిదోనని అవకాశం ఉన్నా ప్రభుత్వం జాప్యం చేస్తుందని మండల సాధన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండల కేంద్రంగా ప్రకటించకుంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

గంగాధర: మండలంలోని మధురానగర్ గ్రామానికి చెందిన వొడ్నాల యజ్ఞేశ్‌తో పాటు దాదాపు యాభై మంది యువకులు మంగళవారం టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. యువకులకు రేవంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేయాలని సూచించారని, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని చాలా గ్రామాల నుంచి పార్టీలో చేరికలు ఉంటాయని మేడిపల్లి సత్యం తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మానకొండూర్: బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, చేసిన అభివృద్ధి, సంక్షేమమే గెలుపునిస్తుందన్నారు. కార్యకర్తలు మరింత ఉత్సాహంతో, సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, నాయకులు ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, ఎరవేని చంద్రయ్య, బేతి రాజయ్య, కొట్టె నరేష్, కూర రమేష్, అనవేని రాజు, పావురాల అంజయ్య, రాదారపు అంజయ్య, బొడ్డు రాజు, కూన ప్రశాంత్, మిట్టపల్లి కుమార్, అనేవేని కుమార్, రాదారపు శ్రీనివాస్, బోజ్జ శేఖర్, శాతరాజు యాదగిరి పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి రూ.పదిలక్షలు మంజూరు

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం అభివృద్ధికి టీటీడీ కమిటీ ద్వారా రూ.పదిలక్షల నిధులు మంజూరుకు కృషి చేసినందుకు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు సర్పంచ్ గుండి మానస, పాలకవర్గం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి

హుజూరాబాద్: ఆర్డీవో హరిసింగ్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న బీసీ, బాలికల హాస్టళ్లను తొలగించి నూతన భవనాలు నిర్మించాలని కోరారు. అద్దె భవనాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్, ఫీజుల బకాయి వెంటనే మంజూరయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రంలో కోరారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, తదితరులు ఉన్నారు.